క్లుప్తంగా

27న శాంతిసరోవర్‌లో రక్షాబంధన్ వేడుకలు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'రక్షాబంధన్' వేడకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రసంగాలు, మెడిటేషన్, రాఖీధారణ కార్యక్రమం,ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఆదివారం నిర్వహించే సండే ఈవినింగ్ టాక్ కార్యక్రమంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు ఫోన్: 040 2300 1234లో సంప్రదించాలని వారు కోరారు.

శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మణ్‌గౌడ్

హఫీజ్‌పేట్: శేరిలింగంపల్లి మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మణ్ గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్ కమిషనరేట్ అటాచ్ అయ్యారు. ఆయన స్థానంలో ముషిరాబాద్ మండల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన లక్ష్మణ్ గౌడ్ శేరిలింగంపల్లికి బదిలీపై వచ్చారు. గతంలో సరూర్‌నగర్, సంగారెడ్డిలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు.

హెచ్‌సీయూను సందర్శించిన కెనడా బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీని కెనడా దేశంలోని అంటారియాకి చెందిన వెస్ట్రన్ యూనివర్శిటీ ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. వెస్ట్రన్ యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ అలాన్‌షెపర్డ్, ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ కెన్నెత్ ఎస్ కోలీ, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ లిలీబో, శాస్త్రి ఇండో–కెనడియన్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్‌ఐసీఐ) ద్వారా ఈ పర్యటన సాగింది. ఈ సందర్భంగా మొదట ఈ బృందం హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు, ఇతర హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, విద్యావేత్తలతో విద్యా సంబంధ అంశాలపై చర్చించారు. పరస్పర ఆసక్తి ఉన్న రంగాలలో సహకార అవకాశాలను, కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యాలను అన్వేసించడం ఈ ప్రతినిధి బృందం పర్యటన లక్ష్యం.

రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం



హనుమంతరావుకు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న నాయినేని సూర్యప్రకాష్‌రావు

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్రంలో ఆత్మహత్యలు చేసుకున్నటువంటి రైతు కుటుంబాలను ఆదుకునేందుకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాయినేని సూర్య ప్రకాష్‌రావు వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు సీహెచ్ హనుమంతరావుకు లక్ష రూపాయల చెక్కును గురువారం అందజేశారు. అనంతరం సూర్య ప్రకాష్‌రావు మాట్లాడుతూ.. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకునేందుకు తమ వంతు సహాయంగా లక్ష రూపాయల చెక్కును హనుంతరావు, జలవేందర్‌లకు అందజేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నాయినేని పద్మారావు, సీహెచ్ సూర్యరావు, జి. పాపారావు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో స్మార్ట్ ఐడియాథాన్ ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: గీతం స్మార్ట్ ఐడియాథాన్ (అత్యుత్తమ ఆవిష్కరణలు చేసిన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమం) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, రుద్రారం ప్రాంగణంలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. స్టార్టప్ ఇండియా, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎమర్జింగ్ మార్కెట్స్ (సీఈఎం), బోస్టన్‌లోని నార్త్ ఈస్టన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ఎడ్యుకేషన్ (ఎస్‌ఏయూసీఈఈ) సహకారంతో నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిలుగా హైదరాబాద్ ఏంజెల్స్ చైర్మన్ రాజేష్ మంతెన, ఆత్మీయ అతిథిగా కంట్రోల్ ఎస్ క్వాలిటీ– ప్రొక్యూర్మెంట్ హెడ్ చంద్రశేఖర్‌శర్మ గరిమెళ్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత జీవితంలో రాణించడానికి ఉపకరించే ప్రాథమిక అంశాలైన ఉత్సుకత, ధైర్యం, శీలం, భావప్రకటనా నైపుణ్యాలపై పట్టు పెంచుకోవాలని వివరించారు. అనంతరం ఉన్నత విద్యా సంస్థలలోని విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదిగే వాతావరణాన్ని ఎలా సృష్టించాలి? అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్ (రిచ్) జీవశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సుస్మితసుందర్, వీహబ్ డైరెక్టర్ (వ్యూహం –భాగస్వామ్యం) సృజన చదలవాడ, ఐఎస్ఓలోని ఐ–వెంచర్ అసోసియేట్ వెస్ట్ ప్రెసిడెంట్ సురేష్ కృష్ణ, ఐటీఐసీ ధృవ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బంగారు తెలంగాణకు బాటలు వేస్తున్నాం

- మూసాపేట డివిజన్ పాదయాత్రలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- అందుకే డివిజన్ల వారీగా పాదయాత్ర చేస్తున్నా
- ఇప్పటి వరకు నాల్గు డివిజన్లలో పాదయాత్ర పూర్తయ్యిందని వెల్లడి



పాదయాత్రలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



బబ్బుగూడలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగ్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే



స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే



మూసాపేట డివిజన్‌లో పాదయాత్ర ప్రారంభించి ప్రజలను కలిసేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే కృష్ణారావుకు హారతులిస్తున్న మహిళలు

మోతీనగర్: మూసాపేటలో ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం పాదయాత్ర నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పీఆర్‌నగర్, అవంతినగర్, బబ్బుగూడ, తదితర ప్రాంతాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుంటు పాదయాత్ర కొనసాగించారు. బబ్బుగూడలో నాలా సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొంతమంది వృద్ధులు తమకు పింఛన్లకు సంబంధించి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వినతిపత్రాలు స్వీకరించిన ఆయన సంబంధిత అధికారులకు అందించి వెంటనే మంజూరు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సంవత్సరం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎమ్మెల్యే పుస్తకాలు, పెన్నులుతో కూడిన బ్యాగ్ కిట్లను అందజేస్తున్నారు. బబ్బుగూడలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు గురువారం అందజేశారు.

మూసాపేట డివిజన్‌లో 90శాతం పనులు పూర్తి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పాదయాత్రలో భాగంగా ఇప్పటి వరకు నాలుగు డివిజన్లలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నానన్నారు. అక్కడక్కడ పరిష్కారం కాని పనులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించానని తెలిపారు. ఇప్పుడు మూసాపేట డివిజన్‌లో పాదయాత్ర మొదలు పెట్టానన్నారు. ఈ డివిజన్లో ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి చేశామని తెలిపారు. పాండురంగనగర్ వీకర్ సెక్షన్‌లో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించామన్నారు.

కేంద్ర మంత్రులుగా ఉన్న వారు ఇక్కడి సమస్యలు పట్టించుకోలేదు..

కేంద్ర మంత్రులుగా ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన నాయకులు సైతం రామారావునగర్, బబ్బుగూడ నాలా సమస్యల గురించి పట్టించుకోలేదన్నారు. నేడు నాలా రిటైనింగ్ వాల్, శ్లాబ్ పనులు తుదిదశకు చేరుకోవటంతో 60సెం.మీ. వర్షపాతం నమోదు అయినా ఎలాంటి ముంపు జరగలేదన్నారు. అర్హులందరికీ త్వరలో డబుల్ బెడ్‌రూంలను అందిస్తామని పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు.

అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి..

ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు బంగారు తెలంగాణకు బాటలు వేస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇలాంటి ముందు చూపు ఉన్న నాయకులు మనకు దొరకడం అదృష్టమన్నారు. ప్రజలు పొరపాటున తెలంగాణ రాష్ట్రాన్ని వేరే పార్టీ చేతిలో పెడితో రాష్ట్ర పరిస్థితి అస్తవ్యస్తమయ్యేదని అన్నారు. తెలంగాణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, నరేంద్రాచార్య, మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, నాయకులు గోపాల్, నాగుల సత్యం, తిరుపతి, కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా సురేందర్‌రెడ్డి



బాలానగర్: బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా నవజీవన్‌నగర్‌కు చెందిన కె. సురేందర్‌రెడ్డి గురువారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

అల్లాపూర్ డివిజన్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర 31న

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో పరిధిలోని శ్రీవివేకానందనగర్ కమిటీహాల్‌లో గురువారం కార్పొరేటర్ సబిహా బేగం ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 31వ తేదీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రకు సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు



కూకట్‌పల్లి: శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా గురువారం వీవీ సత్యనారాయణచౌదరి గురువారం గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు కాంగ్రెస్ మద్దతు



కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి

కూకట్‌పల్లి: మూసాపేటలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు కాంగ్రెస్ పార్టీ ఏ–బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే మన బతుకులు మారతాయని అనుకున్నామని కానీ కేవలం కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా కష్టకాలంలో పారిశుద్ధ్య కార్మికుల కృషి అనిర్వచనీయమైనదని గుర్తు చేశారు. కేసీఆర్ ఇచ్చిన హామీ నెరవేర్చాలని జీతాలు పెంచి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎంపీ రేవంత్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లి కార్మికులకు న్యాయం జరిగేటట్లు కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి ఫిషర్‌మేన్ వైస్‌చైర్మన్ ఆకుల నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు లోబడి ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అంజయ్యనగర్ యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళరావు, సత్యం శ్రీరంగం, దండుగుల యాదగిరి సమక్షంలో యువకులు పార్టీలో చేరారు. బత్తుల సతీష్, రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్, నాయకులు దండుగుల సందీప్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులతో టీపీసీసీ సభ్యులు

ఎమ్మెల్యే మాధవరంకు శుభాకాంక్షలు





ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కూకట్‌పల్లి ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ నాయకులు, వడ్డెర సంఘం నాయకులు

మూసాపేట/ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు, ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ వడ్డేర సంఘం సభ్యులు, జయశంకర్‌నగర్ ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డిపో అధ్యక్షుడు ఐలయ్య, రీజనల్ అధ్యక్షుడు మల్లారెడ్డి, డిపో సెక్రటరీ అశోక్, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, ఈఎస్ రావు, వడ్డెర సంఘం నాయకులు మక్కాల అశోక్, రమేష్, చిన్న, మక్కాల నర్సింగ్, కాలనీ ప్రతినిధులు కనకరాజుయాదవ్, ఫీరోజు, బెల్లం ఐలయ్య, ఐలేష్, డాక్టర్ అందె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో 90శాతం పనులు పూర్తయ్యాయి

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌లోని సమస్యలను తెలుసుకునేందుకు గురువారం సాయినగర్, రాఘవేంద్రనగర్, ఆదిత్యనగర్ కాలనీల్లో స్థానికులతో కలిసి గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో అభివృద్ధి పనులన్నీ దాదాపు 90 శాతం పూర్తయ్యాయన్నారు. సాయినగర్‌లో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. డ్రైనేజీ, సీసీరోడ్ల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, నాయకులు రాజేష్ చంద్ర, కాశీనాథ్ యాదవ్, చిన్నో శ్ల శ్రీనివాస్, గుడ్ల శ్రీనివాస్, శివరాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో కరపత్రాలను అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, నాయకులు

బీజేపీ బలోపేతానికే 'ఎమ్మెల్యే ప్రవాస్ యోజన'



అంధేరి ఎమ్మెల్యే అమిత్‌భాస్కర్‌తో భేటీ అయిన మాధవరం కాంతారావు

కూకట్‌పల్లి: తెలంగాణలో బీజేపీ బలోపేతానికి కోసం పార్టీ అధిష్టానం 'ఎమ్మెల్యే ప్రవాస్ యోజన' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి అసెంబ్లీ ప్రాంతానికి విచ్చేసిన బీజేపీ మహారాష్ట్ర అంధేరి ఎమ్మెల్యే అమిత్‌భాస్కర్ సతమ్‌ను బీజేపీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు శాలువాతో సత్కరించి ఆహ్వానించారు. అనంతరం కూకట్‌పల్లి అసెంబ్లీలో ప్రస్తుత పార్టీ కార్యక్రమాలు, నూతన చేరికలు, ప్రజలకు అందుతున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఓటర్ల నాడి, సంస్థాగత పార్టీ బలోపేతానికి తీసుకున్న చర్యలపై చర్చించారు.

◆ ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. బీజేపీ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 8 రోజులు పాటు మకాం వేసి డివిజన్ల వారీగా పోలింగ్ బూత్ కమిటీ, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో సమీక్షలు నిర్వహిస్తారన్నారు. సర్కార్ భూములను అమ్మి ప్రభుత్వాన్ని నడిపే దీనస్థితికి దిగజార్చిన కేసీఆర్ పాలనను ప్రజలు ఛీదరించుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో బీజేపీని అత్యధిక మెజార్టీతో గెలిపించి అధికారాన్ని అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

మూసాపేట మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎండీ మోయిజ్ గురువారం మద్దతు తెలిపారు. వారితో పాటు ధర్నాలో కూర్చొని ప్రసంగించారు. పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు. – మూసాపేట



యువత కోసం 'యూస్టా' ప్రారంభం

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని శరత్‌సిటీ మాల్‌లో దేశంలోనే అతిపెద్ద రిటైలర్ రిలయన్స్ రిటైల్ యువత కోసం ప్రత్యేకించిన ఫ్యాషన్ రిటైల్ ఫార్మాట్ 'యూస్టా'ను గురువారం ప్రారంభించారు. సమకాలీన సాంకేతిక ఆధారిత స్టోర్ లే అవుట్లతో, యువ వినియోగదారుల కోసమే ప్రత్యేకంగా సరసమైన ధరలలో హై ఫ్యాషన్‌ను యూస్టా అందిస్తుంది. ఈ సందర్భంగా రిలయన్స్ రిటైల్ ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ ప్రెసిడెంట్, సీఈఓ అఖిలేష్‌ప్రసాద్ మాట్లాడుతూ... యూస్టా ఒక యువ డైనమిక్ బ్రాండ్ అని పేర్కొన్నారు. ఇది ఈ దేశంలోని యువతతో పెరుగుతుందన్నారు. వారితోపాటే అభివృద్ధి కూడా చెందుతుందన్నారు. ఫ్యాషన్ అవసరాలను అర్థం చేసుకోవడానికి ఈ బృందం భారతదేశ యువతరంతో నిరంతరం పనిచేస్తుందన్నారు. రోజూ తాజాదనంపరంగా ఔచిత్యం పరంగా దేవన్‌గా ఉంటుందన్నారు. యూస్టా యువతకు వాయిస్ ఇవ్వడమే కాకుండా తమను తాము వ్యక్తీకరించుకునే స్వేచ్ఛను కూడా ఇస్తుందన్నారు. యూస్టా రేంజ్ అంతా ఇప్పుడు హైదరాబాద్ నగరంలో ఈ బ్రాండ్ యొక్క మొట్టమొదటి స్టోర్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. అంతేకాక ఆన్‌లైన్‌లోనూ ఏజియో, జియోమార్ట్ ద్వారా కూడా పొందవచ్చన్నారు.

సురక్షిత ట్రాఫిక్ జోన్ సాధనలో వలంటీర్ల పాత్ర భేష్

రాయదుర్గం: సురక్షితమైన ట్రాఫిక్ జోన్‌గా సైబరాబాద్‌ను రూపొందించడంలో వలంటీర్ల పాత్ర అమోఘమని సైబరాబాద్ ట్రాఫిక్–1 డీసీపీ హర్షవర్ధన్ పేర్కొన్నారు. సైబరాబాద్ పోలీసులు, ఎస్‌సీఎస్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో డిలాయిట్ సంస్థలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిర్వహణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యోగులకు రోడ్డు సంకేతాలు, రాంగ్ రూట్ డ్రైవింగ్, లేన్ క్రమశిక్షణ, మోటార్ వెహికిల్ డ్రైవింగ్ రెగ్యులేషన్ చట్టాలు, బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తన మొదలైన వాటిపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఇదిలా వుండగా హర్షవర్ధన్ ఐపీఎస్‌లో చేరడానికి ముందు డెలాయిట్‌లో పూర్వ ఉద్యోగి కావడంతో ఆయన డెలాయిట్ క్యాంపస్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం విశేషం. ఈ సందర్భంగా ప్రమాదాలకు దారితీసే రియల్ టైమ్ ట్రాఫిక్ దృశ్యాలు, అజాగ్రత్త, అలసత్వ ప్రవర్తన ప్రాణాంతక సంఘటనలకు ఎలా దారితీస్తాయో విశ్లేషించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ ట్రాఫిక్ రణ్వీర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, ట్రాపిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ టీమ్ లలితా టీమ్స్, ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధి కేశవ్ భండారి, పలువురు ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే పాదయాత్ర

బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జల యోగానంద్

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని రామకృష్ణనగర్‌లో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు బీజేపీ సీనియర్ నాయకులు గజ్జల యోగానంద్ గురువారం పర్యటించారు. ప్రజా సమస్యలపై పాదయాత్రలో భాగంగా ప్రజలతో మమేకమవుతూ కార్మికుల కష్టాలు, చిరు వ్యాపారుల బాధలు, సాధారణ ప్రజల గోడును, డివిజన్‌లోని సమస్యలను తెలుసుకునేందుకు 64వ రోజు పాదయాత్ర చేపట్టానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, దళిత బంధు, దళితులకు మూడెకరాల భూమి, రైతు బంధు, వృద్ధులకు పెన్షన్, ఇంటికి ఒక ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఈ విధంగా ఎన్నో అబద్ధపు హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ వీటిని అమలు చేయలేకపోయిందన్నారు. దరఖాస్తు చేసుకున్న వృద్ధులకు పెన్షన్ రాక ఒక్కపూట భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రజల సమస్యలు పట్టించుకోకుండా నిద్రపోతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ గౌడ్, నాయకులు విద్యాకల్పన, ఏకాంత్ గౌడ్, వెలగా శ్రీనివాస్, హరియాదవ్, గణేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళరావు, డాక్టర్ సత్యం శ్రీరంగం, దండుగుల యాదగిరి అన్నారు. గురువారం కట్టమైసమ్మనగర్, అబ్రహార్‌నగర్, షేర్‌గల్లీ, బడే మజీద్, స్టార్ పాయింట్ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్, నాయకులు రాఘవేందర్, తూము వేణు, తూము సంతోష్, మధుగౌడ్, కృష్ణారాజు పుత్ తదితరులు పాల్గొన్నారు.

